

సిద్దిపేట రైల్వేస్టేషన్

# సిద్దిపేటకు రైలుకూత

## రైలు కలను సాకారం చేసిన సీఎం కేసీఆర్

- నేటి నుంచి సిద్దిపేట -కాచిగూడ మధ్య రైల్వేసేవలు
- మధ్యాహ్నం మూడు గంటలకు సిద్దిపేటలో ప్రారంభించనున్న మంత్రి హరీశ్‌రావు
- సిద్దిపేట-కాచిగూడ మధ్య నడవనున్న రెండు రైళ్లు
- సమైక్య రాష్ట్రంలో కాగితాలకే రైల్వేలైన్ పరిమితం
- నాలుగు జిల్లాలో రైల్వేలైన్ పొడవు 151.36 కిలోమీటర్లు
- ఉత్తర తెలంగాణల్లో ఈ రైల్వేలైన్ కీలకం
- రైల్వే సౌకర్యంతో మరింతగా సిద్దిపేట అభివృద్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న జిల్లా ప్రజలు

సిద్దిపేట, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): సిద్దిపేట జిల్లా ఏర్పాటు, గోదావరి నీళ్లు, రైలు, మెడికల్ కళాశాల నాడు ఎన్నికల నినాదాలు... ఇవాళ సీఎం కేసీఆర్ ఆ నినాదాలను నిజం చేశారు. ఆ పనులు ప్రజల కండ్ల ముందు ఆవిష్కృతమయ్యాయి. జిల్లా ఏర్పాటు చేసుకొని చక్కటి పరిపాలనను అందించుకుంటున్నాం. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సాగునీరు రావడంతో ఈ ప్రాంతం సస్యశ్యామలమైంది. ఇవాళ రైలు వచ్చేస్తోంది. దశాబ్దాల కాలంగా ఎదురు చూస్తున్న జిల్లా ప్రజల కలలు సాకారం కావడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం (నేటి) నుంచి సిద్దిపేట-(సికింద్రాబాద్) కాచిగూడకు రైలు సేవలు ప్రారంభం కానున్నాయి. మధ్నాహ్నం మూడు గంటలకు సిద్దిపేట రైల్వేస్టేషన్‌లో ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు రైలును ప్రారంభించనున్నారు. ఇందుకోసం రైల్వే అధికారులు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేశారు. సీఎం కేసీఆర్ కేంద్రమంత్రిగా ఉన్న సమయంలో యూపీఏ ప్రభుత్వ హయాంలో మనోహరాబాద్ నుంచి కొత్తపల్లి వరకు రైల్వేలైన్‌ను మంజూరు చేయించారు.

మెదక్ జిల్లా మనోహరాబాద్ నుంచి కరీంనగర్ జిల్లా కొత్తపల్లి వరకు కొత్త రైల్వేలైన్ నిర్మాణం చేపడుతున్నా రు. ఇప్పటి వరకు 77కి. మీటర్లు రైల్వేలైన్ పనులు పూర్తిచేశారు. సిద్దిపేట జిల్లా పరిధిలో మరో 17 కిలోమీటర్లు, రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలో రైల్వేలైన్ నిర్మాణం చేయాల్సి ఉంది.ఈ జిల్లా పరిధిలో 954 ఎకరాల భూసేకరణకు 808 ఎకరాల భూసేకరణ పూర్తి చేశారు. సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవ, మంత్రి హరీశ్‌రావు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ భూసేకరణ, తదితర పనులపై నిరంతరం పర్యవేక్షణ చేయడంతో జెట్ స్పీడ్‌లో రైల్వేలైన్ పూర్తి చేసుకోగలిగాం. సిద్దిపేట నుంచి తిరుపతి, బెంగళూరు వరకు రైళ్లు ప్రారంభించడంతో పాటు, ప్యాసింజర్ రైలు నడపాలని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డితో కలిసి దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్‌ను స్వయంగా కలిసి విన్నవించారు. దేశ చరిత్రలోనే అత్యంత వేగంగా సిద్దిపేట రైల్వేలైన్ పూర్తి అయిందంటే రాష్ట్ర ప్రభుత్వం వేగంగా భూ సేకరణ చేసి రైల్వేశాఖకు ఇవ్వడంతోనే సాధ్యమైంది. 2,200 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ చేసి రైల్వేశాఖకు అప్పగించింది. దీంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద చెల్లించాల్సిన డబ్బులను చెల్లించింది. నిధులు సమయానికి విడుదల చేయడంతోసిద్దిపేట రైల్వేలైన్ పూర్తి చేసుకోగలిగాం.మొత్తంగా సుమారు వెయ్యికోట్ల వరకు ఖర్చు చేసింది. రాష్ట్ర ప్రభుత్వ సంపూర్ణ సహకారం, ముఖ్యమంత్రి కేసీఆర్ నిరంతర పర్యవేక్షణ, మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక కృషితోనే ఈ ప్రాజెక్ట్ విజయవంతంగా పూర్తి చేశారు.

**సిద్దిపేట రైల్వేస్టేషన్**

సిద్దిపేట శివారులోని నర్సాపూర్, కేసీఆర్ నగర్ కాలనీ సమీపంలో ఈ రైల్వే స్టేషన్ నిర్మాణం జరిగింది.ఈ రైల్వేస్టేషన్ వద్ద ఐదు ట్రాక్ లైన్లలో మూడు లైన్లలో ప్యాసింజర్ రైళ్లు, (వీటిలో రెండు ప్లాట్ ఫామ్ ట్రాక్‌లు ఒకటి మైయిన్ లైన్), 4వ లైన్‌లో గూడ్స్ రైళ్లు, 5వ లైన్‌లో ప్యాకింగ్, మరమ్మతులు, ఇంజిన్ల సైడింగ్ కోసం వినియోగిస్తారు. ఇక్కడనే గూడ్స్ షెడ్ నిర్మాణం చేస్తున్నారు. ఇక స్టేషన్‌లో వీఐపీ లాంజ్, ఫస్ట్ క్లాస్, జనరల్ క్లాస్ వెయిటింగ్ హాల్, టికెట్ కౌంటర్, లిఫ్టు తదితర పనులన్నీ పూర్తి చేశారు. నేటి నుంచి పూర్తి స్థాయిలో రైలు నడవనున్నది.తిరుపతి, బెంగళూరు ప్రాంతాలకు రైలు నడిపేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. కాగా హైదరాబాద్ నుంచి మనోహరాబాద్ మీదుగా గజ్వేల్ వరకు రైలు సేవలు ప్రారంభమై రాకపోకలు సాగిస్తున్న విషయం తెలిసిందే. ఇక్కడి రైల్వే రేక్ పాయింట్ ఏర్పాటుతో ఎరువులను తీసుకొచ్చి జిల్లాలోని అన్ని ప్రాం తాల రైతులకు సరఫరా చేస్తున్నారు. దీంతో ఎరువులు తీసుకురావడానికి సనత్‌నగర్ రేక్ పాయింట్‌కు వెళ్లాల్సిన శ్రమ తప్పింది.

**నాటి నినాదాలను నేడు నిజం చేసిన సీఎం కేసీఆర్**

నలభై ఏండ్ల నుంచి విన్నాం... గోడల మీద రాతలు, ఎన్నికల నినాదాలు, అందమైన కరపత్రాలు, వినివిని అలిసిపోయాం. కానీ సమైక్య రాష్ట్రంలో పనులు మాత్రం కాలేదు.. సిద్దిపేట జిల్లా, రైలు, గోదావరి నీళ్లు తెస్తా అని ఇలా ఎన్నో చెప్పారు.ఎన్నికల ముందు ఎన్నో మాట్లాడారు. నాడు ఎన్నికల నినాదాలే అయితే..ఇవాళ సీఎం కేసీఆర్ వాటిని నిజాలు చేసి చూపించారు. సిద్దిపేట జిల్లా ప్రజల రైలు కలను సీఎం కేసీఆర్ సాకారం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ మూలధనం వాటాగా మొత్తం ఖర్చు భరించి భూసేకరణ, రైల్వే ఏర్పాటుకు అవసరమైన నిధుల్లో మూడోవంతు సమకూర్చడం, రైల్వే నిర్మాణం అనంతరం ఐదేండ్ల పాటు రైల్వేకు వచ్చే నష్టాలను రాష్ట్ర ప్రభుత్వం భరించడం అనే అగ్రిమెంట్‌తో మనోహరాబాద్ నుంచి గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్ల, వేములవాడ మీదుగా కొత్తపల్లి కరీంనగర్ వరకు 151 కిలోమీటర్ల రైల్వేలైన్‌ను ఆనాడు కేంద్ర మంత్రిగా కేసీఆర్ రైల్వేలైన్ మంజూరు చేయించారు. ఇవాళ రాష్ట్ర ముఖ్యమంత్రిగా దాదాపు వెయ్యికోట్ల రూపాయలు ఇస్తే రైలు కల నిజమైంది. నేటి నుంచి రైలు ప్రారంభమవుతున్నది.రోజుకు నాలుగు ట్రిప్పులు నడుస్తుంది. రాబోయే రోజుల్లో సిద్దిపేట నుంచి తిరుపతి, బెంగళురుకు కూడా రైలు నడిపేందుకు ంటాం. విద్యుత్ లైన్ కోసం రూ.150 కోట్లు మంజూరయ్యాయి. టెండర్లు కూడా పిలిచాం. నాలుగైదు నెలల్లో విద్యుద్దీకరణ పనులు పూర్తవుతాయి.విద్యుత్ లైన్ పూర్తి అయ్యాక గంటన్నరలోనే సికింద్రాబాద్ చేరుకుంటాం. రైలు సౌకర్యం రావడంతో ఈ ప్రాంతం మరింతగా అభివృద్ధి చెందుతున్నది. పరిశ్రమలు పెద్ద ఎత్తున వస్తాయి. యువతకు ఉపాధి దొరుకుతున్నది.


# టాస్క్‌ల పేరిట సైబర్ నేరగాళ్ల దోపిడీ

## లక్షలు నష్టపోయిన ముగ్గురు బాధితులు

అమీన్‌పూర్, అక్టోబర్ 2: మూడు వేర్వేరు ఘటనల్లో ముగ్గురు ఉద్యోగులు సైబర్ మోసగాళ్ల చేతిలో రూ.లక్షలు నష్టపోయారు. ఈ ఘటనలు అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ మండలంలోని కృష్ణానగర్ బీరంగూడకు చెందిన ఓ ఉద్యోగికి పార్ట్ టైం జాబ్ అంటూ సెప్టెంబర్ 18న వాట్సాప్ మెసేజ్ వచ్చింది. దీంతో ఆ ఉద్యోగి తన వివరాలు నమోదు చేశాడు. సైట్ నిర్వాహకులు అతడికి ఒక వాలెట్ ఐడీ క్రియేట్ చేశారు. దీంతో ఉద్యోగి ముందుగా రూ.2 వేలు చెల్లించి ఇచ్చిన టాస్క్ చేయడం మొదలుపెట్టాడు. తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్‌లో చూపిస్తూ వచ్చారు. సైబర్ నేరగాళ్లు ఉద్యోగితో నగదు పెట్టిస్తూ తనకు ఇచ్చిన వాలెట్‌లో నగదుతోపాటు కమిషన్ చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితుడికి మొత్తం రూ.13.20 లక్షలు రావాల్సి ఉంది. ఉద్యోగి చివరిగా తాను పెట్టిన నగదుతోపాటు కమిషన్ ఇవ్వాలని అడుగగా స్పందించలేదు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం అమీన్‌పూర్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అమీన్‌పూర్‌లోని కృష్ణ భగవాన్ కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి సెప్టెంబర్ 18న జాబ్ ఆఫర్ అంటూ మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు తన వివరాలను నమోదు చేసి నగదు ఇన్వెస్ట్ చేస్తూ ఇచ్చిన టాస్క్‌లు పూర్తి చేస్తూ మొత్తం రూ.6.50 లక్షలు పెట్టాడు. చివరికి నగదుతోపాటు కమిషన్ ఇవ్వాలని అడగడంతో వారు స్పందించలేదు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ క్రైమ్, అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

**మరో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని..**

అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడ సాయిభగవాన్ కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగినికి సెప్టెంబర్ 17న జాబ్ ఆఫర్ మెసేజ్ వచ్చింది. దీంతో బాధితురాలు తన వివరాలు నమోదు చేసి నగదును పెట్టుబడి పెడుతూ ఇచ్చిన టాస్క్‌లు పూర్తి చేస్తూ, మొత్తం రూ.7.50 లక్షలు పెట్టింది. చివరికి తన నగదుతోపాటు కమిషన్ అడగడంతో సైబర్ నేరగాళ్లు స్పందించలేదు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించింది. తర్వాత సోమవారం అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి

# సీఎం కేసీఆర్‌తోనే గ్రామ స్వరాజ్యం

## ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్ అర్బన్, అక్టోబర్ 2 : గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమైందని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో వారు గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సం దర్భంగా మాట్లాడుతూ శాంతియుతంగా పోరాడి దేశానికి స్వాతంత్ర్యం సాధించిన మహానుభావుడు మహాత్మాగాంధీ అన్నారు. శాంతిమార్గాన్ని ఎంచుకుని నిరాహార దీక్షతో సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని సాధించి తెలంగాణ ప్రజలకు జాతిపిత అయ్యారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జకీయోద్దీన్, కమిషనర్ విద్యాధర్, కౌన్సిలర్లు గోపాల్‌రెడ్డి, మెట్టయ్య, రజిత, బాలేశ్, బా లమణీ శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, లక్ష్మీకిషన్‌రెడ్డి, చందు, రహీం, శ్యామల మల్లేశం, చందనారవీందర్, భాగ్యలక్ష్మీ దుర్గాప్రసాద్, పాల్గొన్నారు.